క్లుప్తంగా

దావులూరులో వలంటీర్ల రాజీనామా

దావులూరు(కొల్లిపర): కొల్లిపర మండల పరిధిలోని దావులూరు సచివాలయంలో నలుగురు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. దావులూరు వలంటీర్లు నలుగురు రాజీనామా పత్రాలను సచివాలయంలో పీఎస్ ఎ.ఫణికుమార్‌కు సమర్పించారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవోకి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీనామ చేసిన వలంటీర్లు బి.సందీప్, సిద్దుల పవన్‌కుమార్, గద్దం విజయ్‌కుమార్, జాలాది అనుపమ తదితరులు పాల్గొన్నారు. ఎంతో కాలంగా సేవలందిస్తున్న వలంటీర్లను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిందారోపణలకు గురిచేయడంతో రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

వృద్ధులకు దోమ తెరలు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్యామ్ అండ్ జైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చెంచుపేటలోని సంస్థ కార్యాలయంలో వృద్ధులకు దోమ తెరలు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌పాల్ మాట్లాడుతూ శ్యామ్ అండ్ జైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అలెగ్జాండర్, జ్యోతిర్మయి, శిరీష, శ్రీకాంత్, చంద్రశేఖర్, పాస్టర్ షాలేమ్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు కొల్లిపర మండలంలో రోడ్‌షో

తెనాలి అర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు కొల్లిపర మండల పరిధిలోని పాతబొమ్మువారిపాలెం, అన్నవరం, గొడపాలెం, ఎస్సీ కాలనీ లో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్ షోలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తనిఖీల్లో మద్యం పట్టివేత



తెనాలి రూరల్: ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో మద్యం పట్టుబడింది. అధికారులను గుర్తించిన నిందితుడు తన మోటారు బైక్‌ను, మద్యం సీసాలను వదిలేసి పరారయ్యాడు. జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనాలి వైకుంఠపురం సమీపంలోని రైల్వే వంతెన వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ గురువారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టింది. ఓ వ్యక్తి బైక్‌పై వస్తూ అధికారులను చూసి బైక్‌తో సహా పరారయ్యేందుకు యత్నించాడు. సిబ్బంది వెంబడించడంతో బైక్‌ను, దానిపై ఉన్న గోనె సంచిని వదిలేసి వెళ్లిపోయాడు. అధికారులు సంచిని పరిశీలించగా 48 క్వార్టరు సీసాలు ఉన్నాయి. వాటిని స్వాధీనపర్చుకుని సుల్తానాబాద్‌లోని మద్యం డిపోకు తరలించారు. కేసు నమోదు చేసినట్టు పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ పీపీ కిరణ్‌కుమార్, ఎక్సైజ్‌ఎస్‌ఐ ఎండీ ఆసిఫ్‌బేగ్, ఏఎస్‌ఐ రహమాన్, డి. దేవభిక్షమ్, కరిముల్లా, జీఎస్టీ అధికారి శివనాగేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి, నాగప్రసాద్ పాల్గొన్నారు.

రూ.2 లక్షలు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 1వలైనులో సూర్యదేవర కృష్ణ రూ.2 లక్షలు నగదుతో వెళుతున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి ఆధారం లేకుండా నగదు తీసుకెళుతున్నట్లు ధ్రువీకరించి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే డివిజన్ గ్రూప్‌-డి ఉద్యోగులకు ఘన సత్కారం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సజావుగా పని చేయడంలో అమూల్యమైన అద్భుతమైన సేవలను అందించినందుకు గ్రూప్ డి ఉద్యోగులు అభినందనీయులని డివిజన్ మహిళా సంక్షేమం అధ్యక్షురాలు ఎం.ఆశాలత అన్నారు. స్థానిక గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజన్ పరిధిలోని మే డేను పునస్కరించుకుని గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ రైల్వేలు సజావుగా సాగేందుకు తెరవెనుక పని చేసే గ్రూప్ డి ఉద్యోగులే నిజమైన హీరోలని అన్నారు. రైల్వేల ప్రతిష్టను నిర్మించడంలో గ్రూప్ డి సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మంచి పనిని గుర్తించి వారి మనోధైర్యాన్ని పెంచడం మా బాధ్యత అని చెప్పారు. అనంతరం పలువురు డివిజన్ గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.

జగన్‌మోహన్‌రెడ్డి వెంటే మెజారిటీ బ్రాహ్మణులు

రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు, రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్



ఎన్నికల ప్రచారంలో కామేశ్వరరావు, శ్రీకాంత్

తెనాలి: రాష్ట్రంలోని మెజారిటీ బ్రాహ్మణులు తమకు మేలుచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు అన్నారు. రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం తెనాలి వచ్చారు. బ్రాహ్మణ సామాజిక వర్గీయులను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎందరో పేద బ్రాహ్మణుల పిల్లలు ఉన్నత చదువులు చదివినట్టు కామేశ్వరరావు చెప్పారు. గత అయిదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బ్రాహ్మణులకు నవరత్నాల సంక్షేమంతోపాటు వివిధ పథకాల్లో అదనంగా రూ.780 కోట్ల ఆర్థికసాయం అందినట్టు చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు బ్రాహ్మణులకు చేసిందేమీ లేకపోగా మళ్లీ ఇప్పుడు మేనిఫెస్టోతో మరోసారి ముంచడానికి వస్తున్నారని హెచ్చరించారు.

చంద్రబాబు మేనిఫెస్టో ధృతరాష్ట్ర కౌగిలి : రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోను నమ్ముకోవటమంటే ధృతరాష్ట్రుడి కౌగిలిని ఆశ్రయించినట్టేనని హెచ్చరించారు. ధార్మిక పరిషత్‌ను రద్దుచేసింది టీడీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. కొన్ని వేల కోట్ల విలువైన సదావర్తి సత్రం భూములను కబ్జాచేసిన చరిత్ర ఎవరిదని అంటూ, హిందూ ధార్మిక వ్యవస్థను, దేవాలయ సత్రాలను కాపాడేది మీరా? అని ప్రశ్నించారు. ఇప్పుడేమో శ్రీరంగనీతులు చెబుతరా? అన్నారు. 'తిరుమలలోని వెయ్యికాళ్ల మంటపాన్ని కూల్చిన మీరు, రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో వెయ్యికాళ్ల మంటపాలను నిర్మిస్తామంటే నమ్మేది ఎవరు' అని ప్రశ్నించారు. విజయవాడలో 35 దేవాలయాలను కూల్చేసిన చరిత్ర మీది కాదా బాబూ! అని కూడా అడిగారు.

తండ్రి చనిపోతే తలనీలాలు ఇవ్వని దౌర్భాగ్యుడు చంద్రబాబు అన్నారు. బూట్లు వేసుకుని పూజలు చేసినందుకే రాజధాని తాత్కాలికంగానే మిగిలిపోయిందన్నారు. బ్రాహ్మణుల ఓట్లు అడిగే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 56 వేల బ్రాహ్మణులకు రూ.64.87 కోట్ల లబ్ధి చేకూరితే జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 1,31,594 మందికి 308.85 కోట్ల లబ్ధి జరిగిందని చెప్పారు. ఇద్దరి పాలనలో మహిళల బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఎవరివల్ల లాభం జరిగిందో తెలుస్తుందన్నారు. 13 జిల్లాలను 26 చేయటం, 2.31 లక్షల ఉద్యోగాల భర్తీ, వైద్యరంగంలో 50 వేల పైగా ఉద్యోగాల కల్పన, విద్యా, వైద్యరంగాల అభివృద్ధి బాబుకు కనిపించటం లేదా? అని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు. స్థానిక వైసీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, కార్పొరేషన్ల డైరెక్టర్లు త్రిపురారిభట్ల సత్య జ్ఞానప్రసూనాంబ, క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ నందివెలుగు రామకృష్ణశర్మ, పులిపాక శర్మ, వాడపల్లి శివరామకృష్ణ, నందుల సత్యకుమార్, దీవి శ్రీనివాసాచార్యులు, నిమ్మగడ్డ శివకుమార్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు బిగ్ షాక్

పలు వార్డుల్లో ఆయా పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



షేక్ జిలాని ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ మైనారిటీ నేతలు, కార్యకర్తలు



పార్టీలో చేరిన పట్టణ 13 వార్డు టీడీపీ, జనసేన కార్యకర్తలు

తెనాలి: సార్వత్రిక ఎన్నికల దగ్గర పడుతున్న కొద్దీ టీడీపీ, జనసేనలకు షాకుల వెంట షాకులు తగులుతున్నాయి. ఆయా పార్టీలకు చెందిన పలువురు క్రియాశీలక కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేస్తామని ప్రకటిస్తున్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని పలు వార్డులకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు పెద్దసంఖ్యలో సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముందుగా పట్టణ 13వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు రజక, మైనారిటీ సోదరులు స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలను కప్పి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. పఠాన్ షరీఫా ఆధ్వర్యంలో కె.శ్రీను, కె.నాగరాజు, కె.అశోక్, కె.కోటేశ్వరరావు, ఆవులమంద రాంబాబు, ఆలూరి కిరణ్, ఏటూరి వెంకటేశ్వరరావు, చికలపాటి శ్రీను, సుంకర వెంకయ్య, అనుమర్లపూడి బాబూరావు, గోనుగుంట సత్యనారాయణ, ఎస్‌కే హుస్సేన్‌సాహెబ్, ఎస్‌కె కరిముల్లా, ఎస్‌కే నాయిబ్‌లు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. వీరితో పార్టీ నేత కుర్రా శ్రీను ఉన్నారు. పట్టణ 14వ వార్డు మైనారిటీ నాయకుడు ఎస్‌ఎం సాదిక్ ఆధ్వరలో మైనారిటీ యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. కరిముల్లా, ఖాజా, సమీర్, సోమెల్, నంద, అన్వర్, నాగూర్‌భాషా, బుజ్జి, ఎస్‌కే సుభానీలను ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ కండువాలకు స్వాగతం పలికారు. వీరితో కౌన్సిలరు దాసరి వీరవసంతరావు, పార్టీ నాయకులు మన్నవ ప్రభాకర్, ఎష్‌కే హఫీజుల్లా, ఎస్‌కే బాష ఉన్నారు. పార్టీ పట్టణ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎస్‌కే జిలాని ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మైనారిటీ నాయకులు, యువకులు టీడీపీ నుంచి వైఎస్సార్‌పీపీలో చేరారు. పావురాల సుభాని, ఎస్‌కే జాని, ఎస్‌కే బాజీ, బషీర్, సంధాని, అన్వర్, గణేష్, మాబు బాష, శివ, ఎస్‌కే అమన్‌లకు పార్టీ కండువాలను కప్పి ఎమ్మెల్యే శివకుమార్ పార్టీలో చేర్చుకున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండడం, ఎమ్మెల్యే శివకుమార్ గరిష్టంగా నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ లబ్ధిని కలిగిస్తుండటంతో ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు ప్రకటించారు.

చలివేంద్రాలు సరే... మంచినీరేదీ



ఖాళీ చలివేంద్రం ఎదుట సీపీఎం నాయకులు

తెనాలి: పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాల్లో మంచినీరు ఏర్పాటు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడి, ఎస్.సుబ్రహ్మణ్యం అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల మున్సిపల్ చలివేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. చలివేంద్రం ఏర్పాటుచేసిన మున్సిపాలిటీ అధికారులు మంచినీరు పెట్టటం, మనిషిని ఏర్పాటు చేయకపోవటంలో గల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతతో ప్రజలు అల్లాడుతున్నారని, వందలాది ప్రయాణీకులు మంచినీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి మంచినీరు ఏర్పాటు చేయాలని కోరారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: గత నెలలో విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో గుంటూరు నగరంలోని ప్రభుత్వ, నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం అవగాహన యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆర్టీసీ కాలనీలోని సన్మానించారు. ఈసందర్భంగా ఇజ్రాయిల్‌పేటలోని బొర్రా నాగేశ్వరరావు నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాల నుంచి 582 మార్కులు సాధించిన విద్యార్థిని ఫాతిమా తబస్సుమ్‌తో పాటు అదే ప్రాంతంలోని సెయింట్ లారెల్స్ హైస్కూల్ నుంచి 588 మార్కులు సాధించిన మొహమ్మద్ గౌస్ నయీముద్దీన్‌ను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. అదే విధంగా నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి 570కి పైగా మార్కులు సాధించిన మరి కొంత విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అవగాహన యోగా కేంద్ర ప్రధాన యోగా చార్యుడు అచ్యుత ఇందుశేఖర్, సెయింట్ లారెల్స్ హైస్కూల్ డైరెక్టర్ మేకల రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యపతాక స్వర్ణోత్సవాలకు అంకురార్పణ



డాక్టర్ వేదాంతం వెంకటా చలపతికి నృత్యగురువుల సత్కారం

తెనాలి: కూచిపూడి నాట్యపతాక స్వర్ణోత్సవ వేడుకలకు సన్నాహంగా గురువారం తెనాలిలో నృత్యగురువులు సమావేశమయ్యారు. పట్టణానికి చెందిన కూచిపూడి నృత్యగురువు భాస్కర్ల రంగనాయకి నృత్యశిక్షణ కేంద్రంలో జరిగిన సమావేశానికి కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేదాంతం వెంకటా చలపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 1974లో వేదాంతం పార్వతీశం కూచిపూడి నాట్యపతాకాన్ని రూపొందించారని ఆయన గుర్తుచేశారు. విభిన్న సంప్రదాయాలు కలిగిన కూచిపూడి నాట్యరీతులన్నీ కలిసిమెలసి ఒకటిగా ఈ పతాకనీడలో వసుధైక కుటుంబంగా ఏర్పడాలన్నది స్వర్గీయ పార్వతీశం ఆశయంగా చెప్పారు. ఆయన ఆశయాన్ని సిద్ధింపజేస్తూ కూచిపూడి పతాక స్థూపాన్ని మన నాట్యానికి పుట్టినిల్లయిన కూచిపూడి గ్రామంలో నిర్మించుకుందామని చెప్పారు. స్వర్ణోత్సవాలు డిసెంబరులో కూచిపూడిలో జరుగుతాయని, ఈ వేడుకలను తెనాలి నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. తెనాలి కూచిపూడి నృత్యగురువులు నిర్మలా రమేష్, జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి, ఎ.వెంకటలక్ష్మి, డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి, వసంతదుర్గ, జ్యోతి, ఆరాధ్యుల కన్నా పాల్గొన్నారు. కూచిపూడి నాట్యాచార్యులు వెంపటి సత్యప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేదాంతం వెంకటా చలపతిని సత్కరించారు.

సంక్షేమమే పరమావధిగా జగన్ పాలన

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్



ప్రజలకు అభివాదం చేస్తున్న శివకుమార్

తెనాలి రూరల్: సంక్షేమం, అభివృద్ధి పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన జరిగిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చావావారిపాలెం, అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో గురువారం సాయంత్రం నుండి రాత్రి వరకు రోడ్ షో నిర్వహించారు. గ్రామాల్లో అడుగడుగునా ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. చావావారిపాలెం నుండి సాయంత్రం ప్రారంభమైన రోడ్ షో మేజర్ పంచాయతీలైన అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో రాత్రి వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ప్రచారంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, చావావారిపాలెం సర్పంచ్‌గంటా సలోమి, గంటా కిరణ్, చింతాబత్తిని బుజ్జి, రమేష్, బసవపూర్ణయ్య, అంగలకుదురు ఎంపీటీసీ ముప్పవరపు సంధ్యారాణి, ముప్పవరపు ముత్యాలరావు, కావూరు కిషోర్, కడియాల సురేష్, కొండముది విజయ్, చుండూరు గోపి, మీరాషా, తోట శ్రీకాంత్, లావు శ్రీనివాసు, మొవ్వ ఆనంద్, జాస్తి శ్రీనివాస్, సూర్యదేవర పూర్ణయ్య, వెలగపూడి సాయి, ప్రసన్నకుమారి, బాదుల్లా, పాలడుగు సాంబశివవవు, రెడ్డి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, శివరామిరెడ్డి, సాల్మన్, కనకసుందరం, సురేష్, గోపినాయక్, కొండముది కిరణ్, కొండముది విజయ్, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

అనుమతి లేని టీడీపీ ప్రచార ఆటోపై కేసు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నాయకులు అనుమతి లేని ఆటో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ వెంకట్రావు తన ఆటో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నాడు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు వైద్య విభాగానికి రూ.5 లక్షల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి జింకాన చేస్తున్న సేవలను మరువలేమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. గురువారం జింకానా ప్రతినిధి డాక్టర్ త్రిపురనేని రవి ఆర్థిక సహకారంతో జింకాన కోఆర్డినేటర్లు డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ బాల భాస్కర రావు రూ.5 లక్షల రూపాయల విలువ చేసే వైద్య పరికరాలను మత్తు వైద్య విభాగానికి సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మత్తు వైద్య విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ త్రిపురనేని రవి ఆర్థిక సహాయంతో వైద్య పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరికరాల వల్ల ఆపరేషన్ చేసే సమయంలో మత్తు ఇచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మత్తు విభాగాధిపతి డాక్టర్ పోలయ్య పాల్గొన్నారు.

మానసిక వైద్య విభాగంలో..

గుంటూరు మెడికల్: రోగులకు ఎలాంటి నొప్పి, బాధ లేకుండా మత్తు ఇచ్చి షాక్ ట్రీట్ మెంట్ వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను మానసిక విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి కోరారు.

ప్రజలతో మమేకమై అభివృద్ధి చేశా

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్



అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అన్నాబత్తుని శివకుమార్

తెనాలి రూరల్: శాసనసభ్యుడిగా గత ఐదేళ్ల కాలంలో ప్రజలతో మమేకమవుతూ తెనాలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో అగ్నికుల క్షత్రియ సంఘీయులు గురువారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలను అనేక సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు చేశారన్నారు. ఫలితంగా నియోజకవర్గంలో రూ. 1800 కోట్ల మేర సంక్షేమాన్ని ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. పదేళ్లు పరిపాలించిన వారు తెనాలిలో ఒక పరిశ్రమ కానీ, ఒక ఫ్యాక్టరీ కానీ తీసుకొచ్చారా, ఎవరికైనా ఉద్యోగం ఇప్పించారా అని ప్రశ్నించారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా, తన కళాశాలల ద్వారా 2800 నుంచి 3,000 మంది వరకు ఉద్యోగాలు ఇప్పించినట్టు చెప్పారు. మన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగడంతో పాటు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని, ఇందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శివకుమార్‌తో పాటు 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావును సంఘీయులు సత్కరించారు. సమావేశంలో శైకం లక్ష్మణరావు, కన్న వెంకట్రావు, మైలా చెన్నకేశవరావు, కొక్కిలగడ్డ తిరుమలరావు, కోలా పోతురాజు, కన్నా శ్రీనివాసరావు, బొమ్మిడి వెంకటేశ్వరరావు, సింగోతి హరిబాబు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్‌సీపీ



మహిళలకు నమస్కరించి మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే శివకుమార్

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గురువారం పట్టణ 19వ వార్డులోని ఆర్యవైశ్యుల ఇంటింటికి వెళ్లి మద్దతు కోరారు. అన్నిచోట్లా శివకుమార్‌కు సానుకూల స్పందన లభించటం విశేషం. ఆర్యవైశ్యుల వ్యాపార సంస్థలు, సమీపంలోనే వారి నివాసగృహాలు ఉండటంతో ఎమ్మెల్యే శివకుమార్ ప్రతి వ్యాపార దుకాణానికి వెళ్లారు. అక్కడి నివాస గృహాలను సందర్శించారు. అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరు, నియోజకవర్గంలో తాను గరిష్టంగా అందించిన సంక్షేమాన్ని వివరించారు. ఆర్య వైశ్యుల్లోని పేదలకు నవరత్నాల కింద అందిన సంక్షేమ పథకాల లబ్ధితోపాటు వారికి ఇళ్లస్థలాలను కేటాయించిన వైనాన్ని గుర్తుచేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈబీసీ నేస్తం కింద ఆర్య వైశ్యుల్లోని పేద కుటుంబీలకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం చేసినట్టు చెప్పారు. సంక్షేమ పథకాలు, ఈబీసీ నేస్తం, ఇళ్లస్థలాల పంపిణీ కొనసాగేందుకు మరోసారి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. పలుచోట్ల ఆర్యవైశ్యులు శివకుమార్‌ను సత్కరించారు. సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మున్సిపల్ వైస్‌చైర్మన మాలేపాటి హరిప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు మద్దాళి శేషాచలం, భాస్కరుని శ్రీనివాసరావు, పొత్తూరు రాఘవ, జూటూరు శ్రీనివాసరావు, ఆలమూరి ఫణి, యిడపలపాటి వాసు, కొల్లా గురునాథగుప్త, భాస్కరుని లక్ష్మీనారాయణ, గఫూర్, గోల్డ్ రహిమా, జేబీ జిలాని, అన్నవరపు మదుసూదనరావు, గొడవర్తి సాయిహరేరామ్, పెచ్చింగ్ సుభాని, చుండూరు సాయి పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించండి

జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొలవరపు దేవానంద్



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న జైభీమ్ ఫౌండేషన్ ప్రతినిధులు

తెనాలి అర్బన్: మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొలవరపు దేవానంద్ కోరారు. జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెనాలి మండలం జాకీర్ హుస్సేన్ నగర్ నుంచి హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు వరకు గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు వివిధ గ్రామాల్లో తమ ఎన్నికల ప్రచారం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వి.డేవిడ్, కొత్తపల్లి రామారావు, చిలకా సుమతీ, కనపర్తి రజనీ, గేరా విజయ పాల్గొన్నారు.

మాదిగల ద్రోహి చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ



తెనాలి : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉండగా ఏనాడూ ఎస్సీల వర్గీకరణ గురించి పట్టించుకోకుండా మాదిగల ద్రోహిగా చరిత్రలో నిలిచారని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ విమర్శించారు. అలాంటి చంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పడిన కూటమిని గెలిపించాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలంటూ ఎమ్మార్పీయస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో క్రోసూరులో జరిగిన మాదిగల ఆత్మీయ సదస్సులో పిలుపునివ్వటం స్వార్థపూరితమని ధ్వజమెత్తారు. కొత్తపేటలోని కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో చంద్రబాబు తొలి నుంచీ మాదిగల్ని మోసగిస్తున్నారని, 2014లో అవకాశం వచ్చినప్పటికీ తన నిజస్వరూపమైన వెన్నుపోటును మాదిగలపై అమలు చేశారని కృష్ణ మండిపడ్డారు. 2014లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మంద కృష్ణమాదిగ మద్దతు ప్రకటించి, గెలుపులో భాగస్వామి అయినట్టు గుర్తుచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కృష్ణమాదిగ వర్గీకరణ విషయం ప్రస్తావిస్తే విభజిత ఏపీలో సాధ్యం కాదని, ఇక్కడ మాలలు ఎక్కువగా ఉన్నారని, వాళ్లనుంచి తనకు ఒత్తిడి ఉందని చెప్పారన్నారు. మంద కృష్ణను నమ్మి ఏపీలో మాదిగలు చంద్రబాబు కూటమికి ఓట్లు వేసే పరిస్థితుల్లో లేరని, మాదిగలను గుర్తించి, గౌరవిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

నకిలీ టికెట్లు అమ్మే వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: రైల్వే స్టేషన్‌లో నకిలీ రిజర్వేషన్ టికెట్లను చేయించే వ్యక్తిని జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలానికి చెందిన ఒ.విజయ్‌కుమార్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ల వద్ద రిజర్వేషన్ చేయిస్తానని ప్రయాణికులను మోసగిస్తుంటాడు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు.